ఆదర్శ పాఠశాల పరిశీలన

రెడ్డిగూడెం: మండలంలోని మద్దులపర్వ ఆదర్శ పాఠశాలను, కళాశాలను ఎన్టీఆర్ జిల్లా మోడల్ స్కూల్ జాయింట్ డైరెక్టర్ ఎం.వెంకటకృష్ణారెడ్డి బుధవారం సందర్శించారు. ఈసందర్భంగా ఆయన కళాశాలలో ఉన్న అత్యాధునిక అటల్ టింకరిక్ ల్యాబ్, ఎనిమిదో తరగతి విద్యార్థులకు అందజేసిన ట్యాబ్‌లను పరిశీలించి తగు సూచనలు చేశారు. పదో తరగతి విద్యార్థులతో మమేకమై వారు చదువుతున్న విధానాన్ని పరిశీలించి, వారు ఉత్తీర్ణత సాధించేలా మెలకువలను సూచించారు. ఉపాధ్యాయులతో చర్చించి పాఠశాల నైపుణ్యం అభివృద్ధికి అవసరమైన సూచనలు చేశారు. కార్యక్రమంలో సీబీఎస్సీ ఇన్‌చార్జి శ్రీలత, ఏఎంఓ సత్యనారాయణ పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అమలు

ఎమ్మెల్యే రక్షణనిధి


ప్రభుత్వ పథకాల బ్రోచర్ అందిస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి

పుట్రేల(విస్సన్నపేట): అర్హతే ప్రామాణికంగా పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందజేస్తున్నామని ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి చెప్పారు. మండలంలోని పుట్రేల సచివాలయం -1 పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం బుధవారం నిర్వహించారు. గత మూడేళ్లుగా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ఎమ్మెల్యే గడప గడపకు వెళ్లి వివరించటంతో పాటు సంక్షేమ పథకాల బ్రోచర్లను అందజేశారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

నాణ్యమైన విద్యాబోధన..

గతంలో ఏ ప్రభుత్వం అమలు చేయని సంక్షేమ పథకాలను రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే అన్నారు. నాడు - నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వం పాఠశాలల్లో మౌలిక వసతులు మెరుగు పర్చి నాణ్యమైన విద్యాబోధన అందిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ శీలం నాగనర్సిరెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ మద్దిరెడ్డి సూర్యనారాయణరెడ్డి, జెడ్పీటీసీలు భీమిరెడ్డి లోకేశ్వరరెడ్డి, యరమల రామచంద్రారెడ్డి, సర్పంచ్ కారుమంచి స్వాతి, సొసైటీ అధ్యక్షుడు భీమిరెడ్డి సూర్యనారాయణరెడ్డి, కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ భూక్యా రాణి, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ కాలసాని విజయలక్ష్మి, నేతలు కోటగిరి సునీల్‌బాబు, దోర్నాల దామోదరరెడ్డి, ఎంపీటీసీలు ఎస్.అంజిరెడ్డి, జి.నాగేశ్వరరావు, సిరసాని ప్రకాష్, అనుమోలు శివబాజీ, ఎంపీడీఓ ఎస్.వెంకటరమణ, ఎంఈఓ రామకృష్ణ, ఏఓ రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

నేడు పుట్రేలలో..

విస్సన్నపేట: మండలంలోని పుట్రేల గ్రామసచివాలయం -1 పరిధిలో గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమం గురువారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎస్.వెంకటరమణ బుధవారం తెలిపారు. ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి పాల్గొని ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తారన్నారు. మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

జగనన్న పాలనలో సంక్షేమానికి ప్రాధాన్యం

ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు


ప్రభుత్వ పథకాల బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు

ముసునూరు: జగనన్న పాలనలో సంక్షేమమే ప్రధానమని నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు పేర్కొన్నారు. మండలంలోని వలసపల్లి గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా నేతలు, కార్యకర్తలతో కలిసి గడప గడపకు వెళ్లి లబ్ధిదారులను పలకరిస్తూ, పథకాల ద్వారా వారు పొందిన లబ్ధిని గణాంకాలతో సహా వివరించారు. తమ ప్రభుత్వ హయాంలో ప్రజలందరికీ సంక్షేమాన్ని అందిస్తూ, వారి అభివృద్ధికి పునాదులు వేస్తున్న జగనన్నను ఆశీర్వదించాలని ఎమ్మెల్యే కోరారు. తమ ప్రభుత్వంలో అవినీతికి ఆస్కారం లేకుండా ప్రతి పథకంతో లక్షలాది మంది పేదలకు నేరుగా ప్రయోజనం కలిగిస్తున్నామన్నారు. రానున్న కాలంలో మరిన్ని పథకాలను పేద కుటుంబాలకు అందించనున్న జగనన్న ప్రభుత్వాన్ని ఆదరించాలని ప్రజలను కోరారు. అర్హతే ప్రమాణంగా రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని అందరూ గుర్తించి, జగనన్నను మళ్లీ సీఎంను చేయాలని కోరారు. జెడ్పీటీసీ సభ్యుడు వరికూటి ప్రతాప్, ఎంపీపీ ఆర్.కృష్ణకుమారి సుబ్బారావు, వైస్ ఎంపీపీ రాజానాయన, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఎం.నాగవల్లేశ్వరరావు, గ్రామ అధ్యక్షుడు మల్లినేని మురళి, సర్పంచ్ సీహెచ్ దామోదర్, సొసైటీ అధ్యక్షుడు డి.సుబ్రహ్మణ్యం, ఉప సర్పంచ్ డీవీ సుబ్బారావు, స్టేట్ హిస్టరీ అకాడమీ డైరెక్టర్ పి.స్వరూపరాణి, ఎంపీడీఓ జి.రాణి, తహసీల్దార్ డి.సుధ, ఈఓపీఆర్డీ సత్యనారాయణ, వ్యవసాయాధికారి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మహా శివరాత్రికి ముస్తాబైన శివాలయాలు


వెల్వడంలోని బాలకోటేశ్వరస్వామి ఆలయం

వెల్వడం(మైలవరం): మహా శివరాత్రి పర్వదినం పురస్కరించుకుని మైలవరం మండలంలోని శివాలయాలు సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. మండలంలోని వెల్వడం, పుల్లూరు, మైలవరంలోని పాత శివాలయాలను విశేషంగా అలంకరించారు. వెల్వడం గ్రామంలో వేం చేసి ఉన్న శ్రీ బాలకోటేశ్వరస్వామి ఆలయానికి ఎంతో ఘన చరిత్ర ఉంది. సుమారు 150 సంవత్సరాలు క్రితం నాటి గ్రామ పెద్ద దివంగత యరమల కృష్ణారెడ్డికి శ్రీ బాలకోటేశ్వరస్వామి కలలో దర్శనమిచ్చి చెప్పిన చోట తన ఆలయాన్ని నిర్మించాల్సిందిగా వాక్కు ఇవ్వడంతో 1.5 ఎకరాల విస్తీర్ణంలో ఈ ఆలయ నిర్మాణం జరిగిందని గ్రామ పెద్దలు చెబుతారు. గతంలో శ్రీ బాలకోటేశ్వరస్వామి ఆలయానికి మైలవరం మండలం నుంచే గాక తిరువూరు, గంపలగూడెం, తెలంగాణా ప్రాంతాల నుంచి ఎడ్ల బండ్లు కట్టుకుని వెల్వడం తిరునాళ్లకు వచ్చి ముడుపులు చెల్లించుకునే వారని ఆలయ చరిత్ర చెబుతుంది. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా రోడ్డు మరమ్మతులు, విద్యుత్ సౌకర్యాల ఏర్పాట్లతో పాటు తాగునీటి సౌకర్యం కల్పించారు. కోనేటి వద్ద మహిళలు స్నానాలు ఆచరించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వెల్వడం గ్రామస్తులు అత్యధికంగా ప్రవాసాంధ్రులు కావడంతో శివరాత్రి రోజున వారంతా గ్రామానికి చేరుకుని పండుగను అత్యంత వైభవంగా జరుపుకుంటారు. శ్రీబాలకోటేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి తిరునాళ్ల ఫిబ్రవరి 18 నుంచి మూడు రోజుల పాటు జరుగుతాయని శ్రీబాలకోటేశ్వరస్వామి ఉత్సవ కమిటీ తెలిపింది.

ప్రతి భక్తుడు పుణ్యస్నానం ఆచరించడమే లక్ష్యం



ఇబ్రహీంపట్నం: మహా శివరాత్రి పండుగ పురస్కరించుకుని ప్రతి భక్తుడు పుణ్య స్నానం ఆచరించడమే లక్ష్యంగా పవిత్ర సంగమం వద్ద ఏర్పాట్లు చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లు తెలిపారు. స్నానపు ఘాట్లలో బుధవారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. పారిశుద్ధ్య కార్మికులతో మెట్లపై పేరుకుపోయిన నాచు తొలగించారు. సున్నం బ్లీచింగ్ పౌడర్ మిశ్రమాన్ని చల్లించారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు కమిషనర్ తెలిపారు.

డీఈఓను కలిసిన నాయకులు



ఆగిరిపల్లి: గతంలో నూజివీడు డీవైఈఓగా పని చేసి అంబేడ్కర్ కోనసీమ జిల్లా డీఈఓగా పని చేస్తూ సాధారణ బదిలీల్లో భాగంగా ఏలూరు జిల్లా డీఈఓగా బాధ్యతలు చేపట్టిన ఎస్‌వీ రవిసాగర్‌ను ఎస్టీయూ మండల నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం ఏలూరు డీఈఓ కార్యాలయానికి వెళ్లిన ఎస్టీయూ నాయకులు రవిసాగర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు సురేష్‌కుమార్, అబ్దుల్‌హక్, మండల అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేశ్వరరావు, వేణుగోపాలరావు పాల్గొన్నారు.

సుంకొల్లులో మన గ్రామం – మన విశ్వవిద్యాలయం



నూజివీడు: మండలంలోని సుంకొల్లులో స్థానిక హార్టికల్చర్ పాలిటెక్నిక్ కళాశాల ఆధ్వర్యంలో బుధవారం మన గ్రామం-మన విశ్వవిద్యాలయం కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా విద్యార్థులు మామిడి, చిక్కుడు, మొక్కజొన్న తదితర పంటలను పరిశీలించి రైతులతో చర్చించారు. చిక్కుడులో పూత, పిందె నిలవడానికి, చీడపీడల నివారణకు తీసుకోవాల్సిన చర్యలను సూచించారు. క్షేత్రస్థాయిలో రైతుల అనుభవాలను విద్యార్థులు అడిగి తెలుసుకున్నారు. అలాగే మామిడిలో పూత, పిందె నిలవడానికి, తేనె మంచు పురుగు నివారణకు తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులను రైతులకు వివరించారు. అనంతరం ఎన్ఎస్ఎస్ కార్యక్రమంలో భాగంగా గ్రామంలో పరిశుభ్రత, పచ్చదనం, ఆరోగ్యం కోసం నాణ్యమైన పంటలను పెరటిలో పండించడం, ఎండు పూల ద్వారా ఆదాయాన్ని పొందడం తదితర అంశాలపై అంగన్‌వాడీ కేంద్రంలో స్వయం సహాయక సంఘాల మహిళలకు విద్యార్థులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రత్తిపాటి విజయలక్ష్మి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మి, బోధనా సిబ్బంది పద్మజ, కంచన, ప్రసాద్, గ్రామ ఉద్యాన సహాయకులు ఆంజనేయులు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణాను అరికట్టాలి

నూజివీడు: మానవ అక్రమ రవాణాను అరికట్టాలని, దీని గురించి ప్రతి ఒక్కరిలో చైతన్యం తీసుకొచ్చేందుకు ప్రజ్వల సంస్థ కృషి చేస్తోందని ఆ సంస్థ ప్రతినిధులు కె.బలరామకృష్ణ, వై.చంద్రయ్య అన్నారు. పట్టణంలోని జెడ్పీ బాలికల హైస్కూల్, ఎస్ఆర్ఆర్ హైస్కూళ్లలో బుధవారం మానవ అక్రమ రవాణా, వాణిజ్యపరమైన లైంగిక దోపిడీ అనే అంశంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ అక్రమ రవాణా సినిమాల్లో అవకాశాలు, ప్రేమ, మోడలింగ్, వివాహం, గల్ఫ్‌లో ఉద్యోగావకాశాలు తదితర వాటి ముసుగులో చేస్తున్నారన్నారు. 12 నుంచి 18 ఏళ్ల లోపు ఆడపిల్లలు ఈ అక్రమ రవాణా ద్వారా వ్యభిచార కూపంలోకి నెట్టివేస్తున్నారన్నారు. విద్యార్థి దశలోనే మనుషుల అక్రమ రవాణా గురించి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. సంస్థ ప్రతినిధులు వినోద్, దేవకరుణ, హెచ్‌ఎంలు వీవీ ఆదిలక్ష్మి, బి.హేమలత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బలివే శివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

బలివే(ముసునూరు): బలివేలోని మహా శివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేశామని కార్య నిర్వహణాధికారి తల్లాప్రగడ విశ్వేశ్వరరావు, సర్పంచ్ రావు ప్రవీణ సుధాకర్, కమిటీ అధ్యక్షుడు నాగుల నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. ఉత్సవాల ప్రత్యేకాధికారి నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ అపూర్వ భరత్ ప్రత్యేక పర్యవేక్షణలో ఏర్పాట్లు వేగంగా పూర్తి చేశామన్నారు. దేవదాయ శాఖ ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలోనూ, ఉత్సవ ప్రాంగణంలోనూ బారికేడ్లు, లడ్డూ ప్రసాదాలు ఏర్పాట్లు సిద్ధం చేయించామని, పుణ్య స్నానాలకోసం జల్లు స్నానాలు, దుస్తుల మార్చుకునేందుకు తాత్కాలికి రూమ్స్‌ను ఏర్పాటు చేయించామన్నారు. ఎంపీడీఓ జి.రాణి, ఈఓపీఆర్డీ సత్యనారాయణ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య పనులు, నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో బలివే రేవుకు నీరు తరలించామన్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు రహదారులను సరి చేయించే పనులు చేపట్టగా, నూజివీడు ఆర్టీసీ డిపో యాజమాన్యం ప్రతీ 10 నిమిషాలకు బస్సు నడిపేందుకు చర్యలు తీసుకుంటున్నారు. కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపడుతున్నట్లు ఎస్ఐ ఎం.కుటుంబరావు తెలిపారు. ఉత్సవ ప్రాంగణంలో తినుబండారాల దుకాణాలతో పాటు, వినోదం కోసం జెయింట్‌వీల్, కొలంబస్, బ్రేక్‌డాన్స్ వంటివి ఏర్పాటు చేశారు.

నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ

ఆగిరిపల్లి: నూజివీడు కోర్టులో ఓ కేసుకు సంబంధించి కోర్టుకు హాజరుకాని చేకూరి వెంకట సుబ్బారావుపై నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసినట్లు ఎస్ఐ చంటిబాబు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. వెంకట సుబ్బారావు ఎక్కడ ఉంటున్నది తెలియనందున జామీనుదారులకు నోటీసులు ఇచ్చామన్నారు. నూజివీడు రెండో అడిషనల్ జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ జడ్జి ముందు ఈ నెల 16న హాజరై సమాధానం చెప్పాలని, లేకుంటే కోర్టు వారి ఆదేశాల ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

మామిడి, మల్లె రైతులను ఆదుకోవాలి



చంద్రగూడెం(మైలవరం)/రెడ్డిగూడెం/గంపలగూడెం: మైలవరం, తిరువూరు నియోజకవర్గాల్లోని మామిడి, మల్లె రైతుల పరిస్థితి దయనీయంగా ఉందని, రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.కృష్ణయ్య కోరారు. రెడ్డిగూడెం మండలం, చంద్రగూడెం, అనుముల్లంక గ్రామాల్లో మల్లెపూల తోటలు, మామిడి తోటలను ఆయన జిల్లా ప్రధాన కార్యదర్శి పి.వి.ఆంజనేయులు, రైతులతో కలిసి బుధవారం పరిశీలించారు. రైతుల నుంచి పంటల వివరాలను అడిగి తెలుసుకున్నారు. నల్లి, పుల్ల విరుపు, బూజు, ఆకుపై నల్ల తెగులు వలన ఆకులు మాడిపోతున్నాయని రైతులు తెలిపారు. దీనిపై కృష్ణయ్య స్పందిస్తూ.. 1998లో భూపేంద్ర సింగ్ ఉడా కమిషన్ రిపోర్టు ప్రకారం మామిడికి రూ.50 వేలు, మల్లె పూల తోటలకు రూ.లక్ష ఇవ్వాలని కోరారు. రైతు సంఘం స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

• నిబంధనలు పాటించని డీలర్లపై చర్యలు

పుట్రేల(విస్సన్నపేట): ఎరువులు, పురుగు మందుల దుకాణాల డీలర్లు లైసెన్స్ నిబంధనలు పాటించకుంటే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయాధికారి రాజ్యలక్ష్మి హెచ్చరించారు. మండలంలోని పుట్రేల గ్రామంలో ఉన్న ఎరువులు, పురుగు మందుల దుకాణాలను బుధవారం ఆమె తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్లు పరిశీలించి, పురుగు మందుల శాంపిల్స్ సేకరించి పరీక్షా కేంద్రానికి పంపించారు.

• వైఎస్సార్ బీమా నగదు అందజేత

కిలేశపురం(ఇబ్రహీంపట్నం): కిలేశపురంలో బాణావత్ కృష్ణ అనారోగ్యంతో మృతి చెందాడు. గ్రామ సర్పంచ్ కాకి దేవమాత, కార్యదర్శి మునేశ్వరరావు వైఎస్సార్ బీమా తక్షణ సహాయం కింద రూ.10 వేలు మృతుడి కుటుంబ సభ్యులకు బుధవారం అందజేశారు. త్వరలో మిగతా నగదు అందిస్తామన్నారు.వార్డు సభ్యులు కృష్ణ, బాలాజీ, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

• నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

గంపలగూడెం: గంపలగూడెం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ గోగులమూడి శ్రీలక్ష్మి, ఎంపీడీఓ వై.పిచ్చిరెడ్డి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించే సమావేశంలో తిరువూరు ఎమ్మెల్యే కె.రక్షణనిధి ముఖ్య అతిథిగా పాల్గొంటారన్నారు.

• 38 మందికి కంటి వైద్యపరీక్షలు

రెడ్డిగూడెం: అభ్యుదయ యువశక్తి సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఉచిత కంటివైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో వైద్యులు చింతిరాల ఫ్లారెన్స్ పాల్గొని 38 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. సంఘం అధ్యక్షుడు చింతిరాల వెంకటేశ్వరరావు, ప్రతినిధులు సావిత్రి, తాళ్లూరు ఝాన్సీ, సగ్గుర్తి వెంకటరమణ పాల్గొన్నారు.

• 19న మధుమేహ వైద్య శిబిరం

తిరువూరు: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 19న తిరువూరులోని నాగార్జున స్కూల్ ఆవరణలో మధుమేహ వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు జేవీవీ తిరువూరు పట్టణ అధ్యక్షుడు పాపారావు తెలిపారు. రక్తపోటు, మధుమేహంతో పాటు మూర్ఛ వ్యాధిగ్రస్తులు ఈ శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఉచితంగా మందులు అందజేస్తామన్నారు.

• మెనూ ప్రకారం భోజనం అందించాలి

ఆగిరిపల్లి: అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని ఎంపీడీఓ కె.వాణి ఆదేశించారు. ఆగిరిపల్లి మెయిన్ పాఠశాల ఆవరణలోని అంగనవాడీ కేంద్రాన్ని ఎంపీడీఓ బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రంలోని రికార్డులను పరిశీలించారు. చిన్నారులకు వండిన భోజనాన్ని ఎంపీడీఓ వాణి, పంచాయతీ కార్యదర్శి బి.ప్రసాద్ రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. చిన్నారులకు సరిపడా భోజనం పెట్టాలని అంగనవాడీ కార్యకర్త భవానికి సూచించారు.

• మేలైన వ్యవసాయ పద్ధతులపై శిక్షణ

తిరువూరు: దాళ్వా సీజన్‌లో తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి సాధించడానికి రైతులు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని తిరువూరు సహాయ వ్యవసాయ సంచాలకులు కెనడీ సూచించారు. మండలంలోని మునుకుళ్లలో బుధవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించి మేలైన వ్యవసాయ పద్ధతులపై రైతులకు శిక్షణ ఇచ్చారు. ఏఓలు పద్మ, టిప్పుసుల్తాన్, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

• 24 నుంచి స్పోర్ట్స్ మీట్

కేతనకొండ(ఇబ్రహీంపట్నం): ఆర్కే ఇంజినీరింగ్ కళాశాలలో ఈనెల 24, 25 తేదీల్లో ఆర్కే సీఈ స్పోర్ట్స్ ఫెస్ట్(అంతర్ కళాశాలల స్పోర్ట్స్) నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె.రామకృష్ణయ్య తెలిపారు. ఈ మేరకు బుధవారం కళాశాలలో పోస్టర్ ఆవిష్కరించారు. పురుషుల విభాగంలో వాలీబాల్, కబడ్డీ, మహిళల విభాగంలో టెన్నీకాయిట్, త్రోబాల్ పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. కళాశాల పీడీలు గోపాలరావు, కరుణాకర్, హెచ్ఓడీలు పాల్గొన్నారు.

• నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): గొల్లపూడి సెక్షన్ పరిధిలోని 11 కేవీ మౌలానగర్ ఫీడర్ లైన్ల మరమ్మతుల్లో భాగంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ బీవీ సుధాకర్ తెలిపారు. గురువారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు టెలికాం కాలనీ, వ్యవసాయ మార్కెట్ యార్డ్, వెంకటేశ్వర ఫౌండ్రీ, ఎమ్మార్కే బిల్డింగ్ ఏరియా, బొగ్గు దొడ్డి, ఐటీసీ కంపెనీ ఏరియా, దర్గా హరిజనవాడ ఏరియాల్లో సరఫరా నిలిపివేస్తామన్నారు.

• విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించాలి

రెడ్డిగూడెం: మండలంలో విద్యుత్ వినియోగదారులు సకాలంలో బిల్లులు చెల్లించాలని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ డి.కృష్ణనాయక్ అన్నారు. ఎస్సీ, ఎస్టీ వినియోగదారులు ప్రభుత్వం ఇచ్చిన సబ్సిడీ 200 యూనిట్ల వరకు వాడుకున్న వారికి మాత్రమే వర్తిస్తుందన్నారు. 200 యూనిట్లు దాటిన వారికి తప్పని సరిగా బిల్లులు చెల్లించాలని కోరారు.

• సంత్‌సేవాలాల్ మహారాజ్ జయంతి

ఎ.కొండూరు: మండలంలోని రేపూడి తండాలో గిరిజన సంఘం ఆధ్వర్యంలో శ్రీ సంత్‌సేవాలాల్ మహారాజ్ 284వ జయంతి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి బి.గోపిరాజు సేవాలాల్ మహారాజ్ సేవలను కొనియాడారు. అనంతరం మహారాజ్ చిత్రపటానికి నేతలు పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బి.కేసియా, మంగాన, సోమల, బాలాజీ, బుల్లిబాబు, జమల పాల్గొన్నారు.

సచివాలయాల్లో తనిఖీలు

గంపలగూడెం: మండలంలోని గోసవీడు, అమ్మిరెడ్డిగూడెం గ్రామ సచివాలయాలను ఎంపీడీఓ వై.పిచ్చిరెడ్డి బుధవారం తనిఖీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో సిబ్బంది బయోమెట్రిక్ హాజరు, ఈ సేవ సర్వీసులు, సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు(ఎస్‌డీజీ) సర్వే, ఆయుష్మాన్ భారత్ సర్వేలను పరిశీలించారు. ఆయుష్మాన్ భారత్ సర్వే వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సర్వేలో ఐదేళ్లలోపు చిన్నారుల వివరాలను మహిళా కార్యదర్శులు, గర్భిణుల వివరాలను ఏఎన్ఎంలు నమోదు చేయాలన్నారు. 6 నుంచి 19 ఏళ్ల పిల్లల వివరాలు సంక్షేమ సహాయకులు నమోదు చేయాలని ఆదేశించారు. గోసవీడు ప్రాథమిక పాఠశాలలో నాడు - నేడు పనులను పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయా సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.